

వైస్ చైర్మన్‌కు కన్నీటి వీడ్కోలు

మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్రా కోటేశ్వర్ రావు అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. - 10లో



ముగిసిన అధ్యయనోత్సవాలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. - 12లో



శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 12లో

న్యూస్‌రీల్

దండు మైసమ్మ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్-ఎస్ (సూర్యాపేట) : ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ శ్రీ దండు మైసమ్మ ఆలయంలో హుండీని గురువారం ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు.107 రోజులకు గాను 5,65,437 రూపాయలు సమకూరినట్లు ఆలయ అధికారి కుశలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఎడవల్లి ముత్తయ్య, వార్డు సభ్యులు మధు, ఎల్లయ్య, గోపగాని సత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

మునగాల(కోదాడ): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో 14సంవత్సరాల లోపు పాఠశాలల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక కోసం శనివారం పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండి.ఆజంబాబా గురువారం మునగాలలో ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పోటీలు నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. క్రీడాకారులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్



నియామక పత్రం అందిస్తున్న నాయకులు

సూర్యాపేట : తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా మట్టిపల్లి మల్లేష్ యాదవ్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ నియమించారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత సత్యనారాయణ పిళ్లై, రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు మట్టరాజు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గిరగాని భిక్షపతి, రాష్ట్ర నాయకులు ఖమ్మంపాటి భిక్షపతి, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

పాలకవీడు : మండల పరిధిలో వజ్రాల గని రక్షిత అటవీ ప్రాంతంలో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న తుల్స్యానాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా అటవీ అధికారి సతీష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హుజూర్‌నగర్ రేంజ్ అధికారి గౌతమ్ గురువారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వజ్రాల గని బీట్ పరిధిలో ఆక్రమణలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం చేయడం, ఆక్రమణదారులతో అంటకాగడం వంటి పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బీట్ అధికారిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అటవీ ఆక్రమణలపై నాలుగు నెలల క్రితం విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదికలు అందజేశారని వీటి ఆధారంగా ఆక్రమణలకు బీట్ అధికారి సహకారం ఉందని గుర్తించిన అధికారులు సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

ఆరు గ్యారంటీల హామీని వెంటనే అమలు చేయాలి

దురాజ్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీని వెంటనే అమలు చేయాలని, దరఖాస్తులకే పరిమితం కాకూడదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణ మాఫీ ఏకకాలంలో చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి బిల్లులను పాస్ చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. ఈ ఘటన ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, ఎల్గూరి గోవింద్, నరసయ్య పాల్గొన్నారు.

ధాన్యం ఎటుపోతోంది?

అప్పగించిన ధాన్యానికి ఇచ్చిన సీఎంఆర్‌కు పొంతన లేదు

- సాకులు చెబుతూ కాలం వెల్లబుచ్చుతున్న మిల్లర్లు
- కొన్ని చోట్ల నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు
- ఏడాది కిందటి సీఎంఆర్.. ఇప్పటికీ పెండింగే
- మిల్లర్ల మాయాజాలంతో ప్రభుత్వానికి నష్టం
- మిల్లర్లతో అధికారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు

◆ నల్లగొండలోని ఓ రైస్ మిల్లు 2022 వానాకాలం సీజన్‌కు సంబంధించి దాదాపు 5 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇంత వరకు అప్పగించ లేదు.

◆ అదే రైస్ మిల్లు 2023 యాసంగికి సంబంధించి దాదాపు 14 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వలేదు.

ఇదే కాదు.. ఉమ్మడి జిల్లాలోని దాదాపు మిల్లులన్నీ గత యాసంగి సీజన్‌కు సంబంధించిన 85 శాతం సీఎంఆర్ ఇవ్వలేదు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రభుత్వం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యంతో రైస్ మిల్లర్లు దందా సాగిస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద ప్రభుత్వం రైస్ మిల్లులకు అప్పగిస్తోంది. మిల్లర్లు ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. అయితే, మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకుండా ధాన్యాన్ని ఏం చేస్తున్నారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు ధాన్యం పరిమాణం మేరకు 45 రోజుల నుంచి గరిష్టంగా 90 రోజుల్లో సీఎంఆర్‌గా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉన్నా ఉమ్మడి జిల్లాలో మిల్లర్లు కాలం వెల్లబుచ్చుతున్నారు. కొన్ని మిల్లులకు నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఈ వానాకాలం సీజన్‌దే కాదు గత ఏడాది యాసంగి, వానాకాలం సీజన్ల సీఎంఆర్ కూడా ఇంకా పెండింగ్‌లో ఉందంటే అటు మిల్లర్లు, ఇటు జిల్లా యంత్రాంగం పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది.



నల్లగొండలోని రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఇచ్చిన ధాన్యానికి, తిరిగి ఇచ్చిన సీఎంఆర్‌కు పొంతనేది?

మిల్లులకు ఇస్తున్న ధాన్యానికి అనుగుణంగా మిలర్లు సీఎంఆర్ కింద బియ్యం అప్పగించాలి. కానీ ఆ మేరకు సకాలంలో బియ్యాన్ని మిల్లర్లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి ఇచ్చిన క్వింటాల్ ధాన్యాన్ని మరపట్టి 67 కిలోలు (బాయిల్డ్ రైస్ అయితే 68 కిలోలు) బియ్యాన్ని అప్పగించాలి. కానీ, ఉమ్మడి జిల్లాలో ఏడాది దాటిపోయినా గతేడాదికి సంబంధించిన రెండు సీజన్ల సీఎంఆర్ కొన్ని మిల్లులు ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చే ధాన్యంలో సన్న ధాన్యాన్ని మర పట్టి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే సీఎంఆర్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్న విమర్శలున్నాయి. పైగా ప్రభుత్వం ఇచ్చిన, మిల్లుల్లో ఉన్న ధాన్యానికి మధ్య భారీ తేడా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఒక సీజన్‌లో సీఎంఆర్ బియ్యం కోసం మరో సీజన్‌లో ఇచ్చిన ధాన్యాన్ని వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు జిల్లాలో రేషన్ బియ్యం రోజుకు చాలా చోట్ల పట్టుపడుతోంది. పట్టుబడని బియ్యం భారీ మొత్తంలో చాలా మిల్లులకు చేరుతోందని, తక్కువ ధరకు వచ్చే దానినే కొన్ని మిల్లులు తరువాత సీజన్‌లో సీఎంఆర్ కింద పెడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. 2022 వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని దాదాపు 350 మిల్లుల నుంచి 7,12,012 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ కింద రావాల్సి ఉండగా, 604997 మెట్రిక్ టన్నులే ఇచ్చాయి. ఇక 2023 యాసంగి సీజన్ పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. మిల్లుల నుంచి 9,86,800 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ కింద రావాల్సి ఉన్నా 1,95,511 మెట్రిక్ టన్నులే ఇచ్చాయి. ఇంకా 791289 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లోనే ఉంది. మొన్నటి వానాకాలం సీజన్ ధాన్యం ఇచ్చినా సీఎంఆర్ ఇంకా ప్రారంభమే కాలేదు.

గ్యారంటీ లేకపోవడంతో సమస్య..

ధాన్యం తీసుకున్న మిల్లుల నుంచి ఎలాంటి గ్యారంటీ తీసుకోకపోవడం సమస్యగానే మారుతోంది. గతంలో ఏ మిల్లరుకైనా ధాన్యం ఇవ్వాలంటే గ్యారంటీ ఇస్తేనే ధాన్యం ఇచ్చేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్యారంటీ లేకుండానే ధాన్యం ఇస్తూ వచ్చింది. కొందరు మిల్లర్లయితే ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మొత్తం అమ్మేసుకున్నారు. రాజకీయ అండదండలు, ఆమ్యామ్యాల బాగోతంలో అధికారుల కుమ్మక్కు కావడం వల్లనే మిల్లర్లపై చర్యలు లేవనే విమర్శలు వస్తున్నాయి. గతంలో బ్లాక్ లిస్టులో పెట్టిన మిల్లులకు కూడా ధాన్యం కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి.

విజిలెన్స్ దాడుల్లో తేలిందేంటి ?

గత సంవత్సరం మిల్లర్లకు ఇచ్చిన ధాన్యాన్ని మొత్తం బయటకు అమ్ముకున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలతో విజిలెన్స్ అధికారులు మిల్లర్లపై దాడులు నిర్వహించారు. ధాన్యం లేదని చాలా మిల్లుల్లో తేలింది. దాడులకే పరిమితం అయ్యారు తప్ప ఏ మిల్లుపై కూడా చర్యలు తీసుకొన్న పరిస్థితి లేదు. దీంతో మిల్లర్లు మరింత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీరియస్‌గా తీసుకోవడంతో తనిఖీలు చేపట్టారు. ఈసారైనా ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాలి.

ఇటీవల వరకు ఇచ్చిన 2022-23 సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

నల్లగొండ జిల్లాలో..	వానాకాలం	యాసంగి	మొత్తం
అప్పగించాల్సింది	2,98,723	4,64,837	7,63,560
ఇప్పటి వరకు ఇచ్చింది	2,80,865	1,07,184	3,88,049
బకాయి	17,858	3,57,653	3,75,511
సూర్యాపేట జిల్లాలో			
అప్పగించాల్సింది	2,22,274	2,42,359	4,64,633
ఇప్పటి వరకు ఇచ్చింది	1,43,858	12,251	1,56,109
బకాయి	78,416	2,30,108	3,08,524
యాదాద్రి జిల్లాలో..			
అప్పగించాల్సింది	1,91,095	2,79,604	4,70,699
ఇప్పటి వరకు ఇచ్చింది	1,80,274	76,076	2,56,350
బకాయి	10,821	2,03,528	2,14,349



సూర్యాపేటలోని 17వ వార్డులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

తొలిరోజు 8,809

ప్రజా పాలనలో దరఖాస్తుల వెల్లువ

- జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్
- మొదటి రోజు విజయవంతం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ అభయ హస్తం పథకం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరుగ్యారంటీలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటి రోజు నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 475 గ్రామ పంచాయతీల్లో ఎంపిక చేసిన గ్రామాలతో పాటు, 5 మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన వార్డుల్లో కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తొలిరోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా కొనసాగింది. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 8,809 దరఖాస్తులు అందాయి.

బండ్లపల్లిలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజా పాలన కార్యక్రమాన్ని కలెక్టర్ ఎస్. వెంకట్రావు జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరి మండలం బండ్లపల్లిలో ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు. నాగారం మండలం లక్ష్మాపురంలో ఎమ్మెల్యే సామేల్, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, డీపీఓ యాదయ్య, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కోదాడ నియోజకవర్గంలో ఆర్‌డీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలులో భాగంగా..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 6 గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ. 2500ఆర్థిక సహాయం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకం కింద రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ. 12 వేలు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకం ద్వారా రూ. 4 వేల పెన్షన్ అందిస్తున్నట్లు మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకాలను అమలు చేసే క్రమంలో భాగంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభమైన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.



హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తు నింపుతున్న సిబ్బంది

89 పంచాయతీలు.. 21 వార్డుల్లో..

జిల్లాలో మొదటి రోజు 89 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో 21 వార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముందుగా గ్రామ, వార్డు సభలు నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆరు పథకాలకు ఒక్కటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా దరఖాస్తులు అందించారు. గ్రామాలు, వార్డులలో 100 కుటుంబాలకు ఒకటి చొప్పున కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. కాగా గురువార నిర్వహించిన ప్రజాపాలనలో 89 గ్రామ పంచాయతీల్లో 6,134 దరఖాస్తులు రాగా 21 వార్డుల్లో 2,675 దరఖాస్తులు అందాయి.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు కోరారు. గురువారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు చింతల చెర్వు ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యాక్రమంలోఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అభయ హస్తం పథకాలు ఒక వరంలా మారాయని అన్నారు. కుటుంబ వివరాలు ఒకే దరఖాస్తులో నమోదు చేసి అందజేయాలన్నారు. అనివార్య కారణాల వల్ల అందజేయకపోతే మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో ఇచ్చి తప్పక రశీదు తీసుకోవాలని సూచించారు. ముందుగా ప్రజా పాలనలో సీఎం ప్రతిజ్ఞ సందేశ పత్రంను గ్రామ సభ సమక్షంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ పి. అన్నపూర్ణ , వార్డు కౌన్సిలర్ భారత్ మహాజన్ , స్పెషల్ అధికారి జెడ్పీ సీఈఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ రామనుజుల రెడ్డి, మెప్మాపీడీ రమేష్ నాయక్, డీఎస్పీ రవి, మెడికల్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు ప్రజా పాలనలో పాల్గొనాలి

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయుల్లో రాజకీయ చైతన్యం కలిగించడానికి 19వ శతాబ్దంలో ఆంగ్లేయ అధికారి కాంగ్రెస్ పార్టీని స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.డి.అంజద్ అలి, పీసీసీ సభ్యులు కొప్పుల వేణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ల రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు దారావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.



జెండా ఎగుర వేస్తున్న చెవిటి వెంకన్న యాదవ్, చిత్రంలో ఆర్డీఆర్

రోడ్డు ప్రమాదాలు తగ్గలే!

- గత ఏడాదితో పోల్చితే 2023లో 12 ప్రమాదాలు అధికం
- తగ్గిన మృతులు, క్షతగాత్రుల సంఖ్య
- దొంగతనాలకు అడ్డుకట్ట
- మహిళలపై పెరిగిన లైంగికదాడులు
- మిస్సింగ్ కేసులు సైతం..
- ఇద్దరిపై పీడీయాక్ట్

సూర్యాపేట క్రైం: జిల్లాలో ఈ యేడు రోడ్డు ప్రమాదాలు కాస్త పెరిగాయి. గత ఏడాదితో పోల్చితే 12 ప్రమాదాలు అధికంగా జరిగినప్పటికీ మృతులు, క్షతగాత్రుల సంఖ్య మాత్రం తగ్గింది. ముఖ్యంగా ఎన్‌హెచ్ 65 జిల్లా వ్యాప్తంగా 60 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రహదారిపై ఎక్కడా కూడా ప్రమాదాలు జరగకుండా హైవే అధికారులతో మాట్లాడి బారికేడ్లు, దాతల సహకారంతో స్టాపర్లను ఏర్పాటు చేయడానికి పోలీస్‌శాఖ చర్యలు చేపడుతోంది. కానీ వాహనాల అతివేగానికి కళ్లెం వేయడంలో విఫలమవుతుండడంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ సారి హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనాలు తగ్గుముఖం పట్టినప్పటికీ మహిళలపై అఘాయిత్యాలు, మిస్సింగ్ కేసులు పెరిగాయి. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇటీవల కాలంలో జిల్లాలో గంజాయి, పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా గంజాయి ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

తగ్గుముఖం పట్టిన దొంగతనాలు..

గతంలో జిల్లాలో ఏదో ఒకచోట భారీ ఎత్తున సొత్తు, నగదు దోపిడీ జరిగేది. కానీ ప్రస్తుతం జిల్లాలో దొంగతనాలు కొంత మేర తగ్గాయి. ఈ సంవత్సరంలో భారీ ఎత్తున దొంగతనం జరిగిన ఘటనలు ఎక్కడా చోటుచేసుకోలేదు. దొంగతనాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నేనుసైతం కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేశారు. దుకాణ యజమానులు, దాతల సహకారంతో పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి దొంగతనాలకు నివారణ చర్యలు చేపట్టి సఫలీకృతులయ్యారు.



గరిడేపల్లి మండలం కల్మలచెర్వు వద్ద ప్రమాదానికి గురైన ట్రాక్టర్ వద్ద గుమిగూడిన ప్రజలు(ఫైల్)



అనంతగిరి మండలం బొజ్జగూడెం తండా శివారులో ప్రమాదానికి గురైన కారు, బైక్ (ఫైల్)

రివైండ్ 2023

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి..

గంజాయి, గుట్కా, పీడీఎస్ బియ్యం వంటి ఇతరత్రా అక్రమ రవాణాలపై ఎస్పీ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అక్రమ రవాణాకు సంబంధించి 206 కేసులు నమోదుచేసి 540 మందిని అరెస్టు చేశారు. జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, నేరేడుచర్ల పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కూడా తరలించకుండా అడ్డుకట్టవేశారు.

❖ **ట్రాఫిక్ ఇంజనీరింగ్ టీమ్స్ ఏర్పాటు**

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ ఇంజనీరింగ్ టీమ్స్ ఏర్పాటు చేశారు. ప్రమాదం జరుగుతున్న ప్రతి ప్రాంతంలో ప్రమాదాలకు గల కారణాలను నివృత్తి చేసి చర్యలు తీసుకుంటున్నారు. ఈ టీమ్ సభ్యులు ఆయా ప్రాంతాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో చెట్ల పొదలు తొలగించడంతో పాటుగుంతలు పూడ్చడం, లైటింగ్స్, సైన్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయించనున్నారు. అదే విధంగా ప్రమాదాలపై ప్రజలకు అవగాహణ కూడా కల్పిస్తున్నారు.

నేరాలు.. రోడ్డు ప్రమాదాలు.. కేసులు

	2022	2023		2022	2023
ఫిర్యాదులు	10202	11965	దొంగతనాలు	412	352
కేసులు నమోదు	7100	7123	రేప్ కేసులు	51	59
హత్యలు	26	22	పోక్సో కేసులు	122	93
రోడ్డు ప్రమాదాలు	502	514	మిస్సింగ్ కేసులు	51	59
మృతులు	252	231	కిడ్నాప్‌లు	21	12
క్షతగాత్రులు	577	471	ఇసుక కేసులు	212	176
ఆత్మహత్యలు	52	43	పీడీఎస్ బియ్యం	172	151
			గంజాయి	46	23

203 అవగాహన కార్యక్రమాలు

షీ టీమ్ సిబ్బంది జిల్లాలో పని చేస్తున్నారు. మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించడం, కుటుంబ సమస్యల పరిష్కారం, ఆకతాయిలపై చర్యలు, రక్షణ చట్టాల పై అవగాహన కల్పిస్తున్నారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ సంవత్సరం 203 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 126 ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశారు. 126 ఫ్యామిలీస్‌కు కౌన్సిలింగ్ ఇచ్చారు.

❖ **అధునాతన సాంకేతికతతో..**

జిల్లా పోలీస్‌శాఖ పూర్తిస్థాయిలో అధునాతన సాంకేతికతను వినియోగించుకుంటూ ముందుకు సాగుతోంది. నేరాలను ఛేదించేందుకు జిల్లా వ్యాప్తంగా 650కు పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఫిర్యాదుదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫిర్యాదులను సైతం పరిశీలించి సమస్యలను పరిష్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐటీ, కమ్యూనికేషన్ విభాగాలను బలోపేతం చేస్తూ సెంట్రల్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సైతం ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు.

❖ **చెక్ పోస్టులు ఏర్పాటు చేసి..**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులలో 14 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. రూ.3.43 కోట్ల నగదు, రూ. 50 లక్షల విలువగల గంజాయి, రూ.23 లక్షల విలువైన 4,373 లీటర్ల మద్యం, రూ.1.29 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.1.11 కోట్ల విలువైన పరికరాలు, దుస్తులు సీజ్ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు గాను 61 కేసులు నమోదు చేసి..మొత్తం రూ. 6.6 కోట్ల విలువ గల నగదు, ఆభరణాలు, ఇతరత్రా సీజ్ చేశారు. నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న 3,956 మందిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు.

❖ **ఇద్దరిపై పీడీ యాక్ట్**

జిల్లాలో తరచూ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇతరత్రా అక్రమ రవాణాలకు పాల్పడుతున్న 92 మందిపై సస్పెక్ట్ షీట్స్, 72 మందిపై రౌడీ షీట్స్ నమోదు చేసి రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తున్నారు.

❖ **జియో ట్యాగింగ్..**

పాత నేరస్తులు, రౌడీల వివరాలను జియో ట్యాగింగ్ చేశారు. వీరి జీవన శైలిని రోజూ తనిఖీ చేస్తున్నారు. రాత్రివేళల్లో పట్టణ ప్రాంతాల్లో జులాయిగా తిరుగుతున్న వారి వేలి ముద్రలను సైతం సేకరించారు. ఇదే పనిగా వీరు రోడ్లపై తిరుగుతూ గతంలో దొంగతనాలు, ఇతర నేరాల్లో పాల్గొని ఉన్నట్లైతే వీరి వేలి ముద్రల ద్వారా ఇట్టే పసిగట్టేలా ట్యాగింగ్ సహాయపడనుంది.

గంజాయి, నార్కోటిక్ పదార్థాల నిర్మూలనకు కృషి



“జిల్లాలో నార్కోటిక్ పదార్థాలు, గంజాయి నిర్మూలనకు కృషి చేస్తాం. గంజాయి రవాణా చేసే, వినియోగించే వారిపై నిఘా ఉంచాం. గతంలో నేరాలకు పాల్పడ్డవారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. సైబర్ మోసాలు, నేరాల ను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ సెల్‌ను బలోపేతం చేశాం. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వ్యవస్థీకృత నేరాలు జరగకుండా దృష్టి పెట్టాం. మహిళా సంబంధిత నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడతాం. ప్రతి ఫిర్యాదుదారుడు, బాధితుడు నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి సమస్యలపై ఫిర్యాదు చేయాలి. 2024లో అందరికీ మంచి జరగాలని ఆశిస్తున్నా.

- రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట


నల్లగొండ వెటర్నరీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో అధికారులకు దరఖాస్తులు సమర్పిస్తున్న లబ్ధిదారులు


సూర్యాపేట పట్టణంలో దరఖాస్తులు అందజేసేందుకు వచ్చిన లబ్ధిదారులు


వలిగొండ: నాతాళ్లగూడెంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు


వలిగొండ: నాతాళ్లగూడెంలో దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి


మోటకొండూర్: కాటేపల్లిలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఐలయ్య


తిరుమలగిరి: బండ్లపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సామేల్, కలెక్టర్ వెంకట్రావ్


మిర్యాలగూడ: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి దరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు


నకిరేకల్: బాబాసాహెబ్‌గూడెంలో ఎమ్మెల్యే వీరేశానికి దరఖాస్తులు అందజేస్తున్న దివ్యాంగులు


వలిగొండ: దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వృద్ధురాలు

క్లుప్తంగా

64 క్వింటాళ్ల ధాన్యం చోరీ

శాలిగౌరారం: రైతులు నిల్వ చేసుకున్న 64 క్వింటాళ్ల బీపీటీ ధాన్యాన్ని గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని గురుజాల గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు తమ కుటుంబ ఆహార నిల్వల కోసం ధాన్యాన్ని గ్రామసమీపంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు చేసే స్థలంలో ఆరబెట్టుకుంటున్నారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాలీ వాహనంలో గ్రామానికి చెందిన ననుబోతు సోమమల్లుకు చెందిన 12 క్వింటాళ్లు, ననుబోతు రమేశ్‌కు చెందిన 12 క్వింటాళ్లు, ఎల్మకంటి వెంకటనారాయణ 8 క్వింటాళ్లు, ముత్యాల పర్వతాలు 8 క్వింటాళ్లు, ముత్యాల రమేశ్ 5 క్వింటాళ్లు, ముత్యాల శంభులు 4 క్వింటాళ్లు, ఉమ్మల్‌రెడ్డి దేవిరెడ్డి 5 క్వింటాళ్లు, ఉమ్మల్‌రెడ్డి గోపాల్‌రెడ్డి రెండు క్వింటాళ్లు, ఉమ్మల్‌రెడ్డి సంజీవరెడ్డి 6 క్వింటాళ్లు, మోసోజు సత్యనారాయణకు చెందిన రెండు క్వింటాళ్లు చోరీకి గురయ్యాయి. ధాన్యం విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని రైతులు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈమేరకు ఎస్‌ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మఠంపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకీడు మండలం అలింగాపురానికి చెందిన యడ్లపల్లి వెంకటేశ్వర్లు (55) వ్యక్తిగత పని నిమిత్తం హుజూర్‌నగర్‌కు మోటార్‌సైకిల్‌పై వచ్చాడు. పని ముగించుకుని మఠంపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా బక్కమంతులగూడెం సమీపంలో మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఎదురుగా వచ్చి ఇతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు మోటార్‌సైకిల్‌తో సహా రోడ్డుపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావమరిది జమ్మిగుంపుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మృతిచెందిన వెంకటేశ్వర్లు

25 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు, పరారీలో మరో నిందితుడు
- కేసు వివరాలు వెల్లడించిన ఏఎస్పీ

సూర్యాపేట క్రైం: గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్న ముగ్గురిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు వెల్లడించారు. గురువారం సూర్యాపేటలోని ఎన్టీఆర్ పార్క్ వద్ద అనుమానాస్పదంగా ఆపి ఉన్న రెండు కార్లను పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది కార్లను తనిఖీ చేయగా ఒక కారులో 24కేజీ గంజాయి, మరో కారులో 1 కేజీ గంజాయి ఉంది. ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. నిందితులు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం, వటవర్లపల్లి గ్రామానికి చెందిన చెందిన చారగొండ ప్రకాష్, మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తాళ్ల సుమంత్‌గా గుర్తించారు. మరో నిందితుడు భార్గవ రామ్ పరారయ్యాడు. ప్రకాష్, సుమంత్‌లు 5 సంవత్సరాలుగా స్నేహితులు. నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రకాష్ సొంత గ్రామంలో వ్యవసాయం చేస్తుంటాడు. మిర్యాలగూడకు చెందిన సుమంత్‌కు గంజాయి తాగే అలవాటు ఉంది. గంజాయి సాగు చేస్తే హైదరాబాద్‌లో విక్రయించి ఎక్కువ లాభం అర్జించవచ్చని సుమంత్ ప్రకాష్ చేత గంజాయి తోట వేయించాడు. రెండు రోజుల క్రితం గంజాయి తెంపిన తర్వాత ప్రకాష్ సుమంత్‌కు సమాచారం ఇచ్చాడు. ఈనెల 27న సుమంత్ కారులో ప్రకాష్ గ్రామమైన వటవర్లపల్లికి వెళ్లి గంజాయి ఆయన కారులో పెట్టుకుని సుమంత్ అత్తగారు ఊరైన సూర్యాపేట పట్టణానికి వచ్చాడు. రాత్రి సూర్యాపేటలో ఉండి ఉదయం సుమంత్ స్నేహితుడైన హైదరాబాద్‌కు చెందిన భార్గవ్ రామ్‌కి ఫోన్ చేసి సూర్యాపేటకు రమ్మన్నారు. భార్గవ్‌రామ్ సూర్యాపేట పట్టణం ఎన్టీఆర్ పార్క్ వద్దకు వచ్చారు. అయితే ఇక్కడ అనుమానాస్పదంగా ఉన్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని 25కేజీల గంజాయి, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సీఐలు రాజశేఖర్, నాగార్జున, ఎస్‌ఐలు సైదులు, రవీందర్, పట్టణ క్రైమ్ సిబ్బందికి రివార్డ్ అందిస్తామని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ రవిందర్, సిబ్బంది గొర్ల కృష్ణ, గోదేసి కరుణాకర్, జె.సైదులుగౌడ్, అనిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


గంజాయి, నిందితులను చూపుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఇల్లు ఇప్పించండి సారూ..

డిండి: కొంత కాలం క్రితం భర్త చనిపోయాడు.. పిల్లలెవరూ లేరు. అనాథగా ఉన్న ఓ వృద్ధురాలు ఉండడానికి ఇల్లు కూడా లేదు. చిన్న గుడిసెలో నివాసం ఉంటుంది. తనకు ఇల్లు ఇప్పించాలని ప్రజాపాలనకు వచ్చిన అధికారులను వేడుకుంది. డిండి పట్టణానికి చెందిన వృద్ధురాలు చింతపల్లి సాయమ్మ స్థానిక అయ్యప్ప ఆలయ సమీపంలో రేకులతో నివాసం ఏర్పాటు చేసుకుంది. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలనకు వచ్చింది. అధికారులకు రెండు చేతులు జోడించి తాను ఉండటానికి గూడు లేక పడుతున్న బాధను వివరించింది. స్పందించిన సర్పంచ్ మేకల సాయమ్మ, గ్రామ కార్యదర్శి సతీష్‌చంద్ర ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇల్లు నిర్మించి ఇచ్చే విధంగా చూస్తామని పేర్కొన్నారు.


ఇల్లు ఇప్పించాలని కోరుతున్న వృద్ధురాలు

11,500 హెక్టార్లలో అటవీ భూములు

నడిగూడెం : జిల్లాలో 11,500 హెక్టార్లలో అటవీ భూములు ఉన్నాయని జిల్లా అటవీశాఖ అధికారి, నడిగూడెం మండల ప్రత్యేక అధికారి వి.సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని తెల్లబల్లిలో ఆయన మాట్లాడారు. మఠంపల్లి, పాలకవీడు, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాలలో అటవీ భూములుండగా, సూర్యాపేట, చింతలపాలెంలో కొంత రిజర్వు అటవీ భూములున్నట్లు తెలిపారు. మూడు రేంజ్‌లు, 8 మంది సెక్షన్ అధికారులు, 12మంది బీట్ అధికారులు ఈ భూములను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ అటవీ భూములు మునగాల, చిలుకూరు, సూర్యాపేట, నాగారం, జాజిరెడ్డిగూడెం, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉన్నట్లు, ఈ భూములకు పెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గ్యాస్ ఈకేవైసీ కోసం బారులు


మోత్కూరులోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట బారులుదీరిన మహిళలు

మోత్కూరు, ఆలేరు రూరల్ : గ్యాస్ సిలిండర్ రూ.500కే అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ కోసం లబ్ధిదారులు బారులుదీరుతున్నారు. గురువారం మోత్కూరులోని భారత్ గ్యాస్ కార్యాలయానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. కార్యాలయం వద్ద వారం రోజులుగా కార్యాలయం వద్ద ఇదే తంతు కొనసాగుతోంది. అదే విధంగా ఆధార్ కార్డులో మార్పుల కోసం ఆలేరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట ప్రజలు పడిగాపులు కాశారు. ఇదే సమయంలో సర్వర్ మొరాయించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత

మునుగోడు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత అధిష్ఠానాన్ని కోరారు. గురువారం మునుగోడులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే చర్లగూడెం, కిష్టరాయిపల్లి రిజర్వాయర్లు పూర్తిచేస్తారని, దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పట్టణ అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి, పందుల భాస్కర్, బొల్లం వెంకన్న, పందుల అశోక్, మల్లేష్, ఎండీ అన్వర్, ఇటికలపాటి మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కైలాస్ నేత

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు కన్నీటి వీడ్కోలు

- బాపూజీనగర్ స్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి
- అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్రా కోటేశ్వర్‌రావు (విష్ణు) అంత్యక్రియలు గురువారం మిర్యాలగూడలోని బాపూజీనగర్ స్మశానవాటికలో హిందూ సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. గుండెపోటుతో మృతిచెందిన ఆయనను కడసారి చూసేందుకు అభిమానులు, ప్రజలు నివాసానికి భారీగా చేరుకున్నారు. పట్టణంలోని బంగారుగడ్డలో ఉన్న ఆయన నివాసం నుంచి ప్రధాన వీధుల గుండా అంతిమ యాత్ర సాగింది.

మాజీ మంత్రి పరామర్శ..

మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వర్‌రావు మృతికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సంతాపం తెలిపారు. తమ పార్టీ విలువైన కార్యకర్తను కోల్పోయిందని, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. విష్ణు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో భాగంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ స్వయంగా పాడె మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు


పాడె మోస్తున్న నల్లమోతు భాస్కర్‌రావు, సిద్దార్థ

విధుల్లో ఉన్న అటెండర్ మృతి

రామగిరి(నల్లగొండ): విధి నిర్వహణలో ఉన్న అటెండర్ అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన పుట్ట జయమ్మ(60) గత 12 సంవత్సరాలుగా తిప్పర్తి మండల తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తోంది. గురువారం మధ్యాహ్నం తనకు అనారోగ్యంగా ఉందని సహ ఉద్యోగులతో చెప్పి కార్యాలయంలో నిద్రించింది. భోజన విరామ సమయంలో కార్యాలయ సిబ్బంది జయమ్మను నిద్ర లేపడానికి ప్రయత్నించగా లేవలేదు. 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడకు చేరుకుని ఆమెను పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఆమె సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

రోగి వద్ద బంగారు ఆభరణాలు చోరీ

నాగార్జునసాగర్: స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ఈనెల 21న తెల్లవారుజామున రమణమ్మ అనే పేషెంట్ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. సాగర్‌కు చెందిన రమణమ్మ అనారోగ్యంతో ఉండడంతో కుటుంబసభ్యులు ఈనెల 17న ఆస్పత్రిలో చేర్పించారు. 21వ తేదీ తెల్లవారుజామున రమణమ్మ కుమార్తె రమాదేవి బాత్‌రూంకు వెళ్లి వచ్చి చూడగా తల్లి మెడలో ఉన్న బంగారు గొలుసు, లక్ష్మీకాసులు, గాజులు, 8 గుండ్లు, తాళిబొట్టు మొత్తం 8తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే సంబంధిత ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తెలియజేసింది. అదేవిధంగా 22న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రమణమ్మ అల్లుడు రామ్మోహన్‌రావు తెలిపారు. అయితే అపస్మారక స్థితిలో ఉన్న రమణమ్మ అదే రోజున మృతిచెందింది. బంగారు ఆభరణాలు అపహరణకు గురైన రోజున ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ఉద్యోగులు, పేషెంట్ల వివరాల జాబితాను పోలీసులకు అప్పగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ భాను ప్రకాశ్ తెలిపారు. ఈమేరకు సీసీ కెమెరా పుటేజీని పరిశీలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎస్‌ఐ సంపత్‌గౌడ్ మాట్లాడుతూ పేషెంట్ వృద్ధురాలిని అపస్మారక స్థితిలో ఉన్న సమయంలో ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రత్యేక గదిలో ఉంచారని, వారి కుటుంబ సభ్యులు, డాక్టర్లు, నర్సులు మినహా ఎవరూ అక్కడకు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదు కాలేదని చెప్పారు. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువచ్చారని, అందులో ఏమైనా మిస్స య్యాయా అనే కోణంతో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలుపు యాజమాన్యం పాటించాలి

- వరిసాగులో కలుపు నివారణపై వ్యవసాయాధికారి రాజగోపాల్‌రావు సూచనలు

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో బోర్లు, బావులు, చెరువుల ద్వారా వేసిన వరి నాట్ల పనులు పూర్తికావచ్చాయి. వరి సాగు చేసే రైతులు ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్యమైనది కలుపు నివారణ. పొలంలో కలుపు కారణంగా రైతులు తగిన దిగుబడులు పొందలేక తీవ్రంగా నష్టపోతుంటారు. దిగుబడిపై తీవ్రంగా ప్రభావితం చేసే కలుపును నివారించడానికి సకాలంలో చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. వరి సాగులో ప్రధానంగా కలుపు యాజమాన్యం పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాల్‌రావు పేర్కొంటున్నారు. సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

నేరుగా విత్తిన వరి పొలంలో..

ఈ పద్ధతిలో 24-48 గంటలు నానబెట్టి మొలక కట్టిన వరి విత్తనాన్ని విత్తేటప్పుడు ఈ మందుల్లో ఏదైన ఒక దానిని వాడాలి.

- ప్రెటిలాక్లోర్ +సేఫ్‌నర్ మందును ఎకరానికి 600 మి.లీ. నుంచి 800 మి.లీ.వరకు విత్తిన 3 నుంచి 5 రోజులలోపు వాడాలి.


కలుపు మందు చల్లుతున్న రైతు

- పైరజోసల్ఫ్యూరాన్ ఈథైల్ మందును ఎకరానికి 80-100 గ్రాములు, విత్తిన 8-10 రోజులలోపు వాడాలి. ఇది గడ్డిజాతి కలుపు మొక్కలను నివారిస్తుంది.
- బ్యూటాక్లోర్ 1-1.25 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ మందును 500 మి.లీ. ఎకరానికి వాడాలి.
- సైహలోఫాప్ పి.బ్యుటైలా కలుపు మందును ఎకరానికి 300 మిల్లీ లీటర్లు విత్తిన 15-20 రోజులలోపు వాడుకోవాలి.
- ఫినాక్స్ ప్రాప్ పి.ఈథైల్ మందును ఎకరానికి 250 మి.లీ చొప్పున విత్తిన 15-20 రోజులకు వాడుకోవాలి.

గడ్డి జాతి కలుపు నివారణకు నాటిన 15 నుండి 20 రోజులకు వాడాల్సిన కలుపు మందులు

- సైహలో పి.బ్యూటైల్ 300 మి.లీ. ఒక ఎకరానికి లేదా ఫినాక్స్‌ప్రోప్ పి.ఇథైల్ ఒక ఎకరానికి లేదా మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ - క్లోరిమ్యూరాన్ ఇథైల్ అనే మందును 8 గ్రాములు ఒక ఎకరానికి వాడాలి.

నాటిన 3 నుంచి 5 రోజులలోపు వాడే కలుపు మందులు..

- బ్యూటాక్లోర్ 1-1.25 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ 400 మి.లీ. నుంచి 600 మి.లీ. లేదా ఆక్సడయార్జిల్ 35-45 గ్రాములు ఎకరానికి వాడాలి.
- బెన్ సల్ఫ్యూరిక్ మిథైల్ (0.6 శాతం)+ ప్రెటిలాక్లోర్ (6.0శాతం) ఎకరానికి నాలుగు కిలోల గుళికలు వాడాలి.
- పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80-100 గ్రాములు వాడాలి. ఈ మందుల్లో ఏదైనా ఒక దానిని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

గడ్డిజాతి మరియు వెడల్పాకు కలుపు నివారణకు..

- బిస్‌పైర్ బాక్ సోడియం ఎకరానికి 100 మి.లీ. అనగా లీటరు నీటికి 0.5. మి.లీ. మందును కలిపి 15 నుండి 20 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి.
- తుంగ జాతి, వెడల్పాకు కలుపు నివారణకు మైట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరిమ్యురాన్ ఇథైల్ 8 గ్రా ఒక ఎకరానికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విద్యుదాఘాతంతో ముగ్గురికి తీవ్రగాయాలు

మునుగోడు: పార్టీ జెండా కడ్డీని దిమ్మెలో కూర్చోబెడుతుండగా ముగ్గురు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటన మునుగోడు మండలం కోతులారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ గ్రామ కూడలిలో గల పార్టీ దిమ్మె వద్ద సాయంత్రం కార్యకర్తలు జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. జెండా ఇనుప కడ్డీని ఉదయం కిందకు దింపి రంగులు వేశారు. సాయంత్రం ఎగురవేసే సమయంలో కొండోజు నర్సింహ, బుంగమట్ల పరుశురాం, పందుల అశోక్‌లు జెండా కడ్డీని పైకి లేపి దిమ్మెలో కూర్చోపెడుతుండగా పైభాగం 11 కేవీ విద్యుత్ వైర్‌కు తగిలింది. దీంతో షాక్‌కు గురై కిందపడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడే ఉన్న కార్యకర్తలు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అందులో నర్సింహ, పరుశురాంల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

7 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నార్కట్‌పల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 7 ట్రాక్టర్లను నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్, నార్కట్‌పల్లి పోలీస్ సిబ్బంది గురువారం మండల పరిధిలోని అమ్మనబోలు చౌరస్తాలో పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.